# హైటెక్ దీపావళి

- బత్తుల వెంకట దుర్గా ప్రసాదరావు

"నాకు నిజం మతాబులే కావాలి" మొండితనం వీడడం లేదు నాని. అయినా గిరిబాబులో సహనం సడలడం లేదు.

"నా మాట విన్రా నానీ. ఎంత డబ్బు పెట్టినా ఎన్నో మతాబులు రావ్రా ఇప్పుడు" చెప్పాడు గిరిబాబు.

"ఆ వచ్చినవే చాలు" చెప్పాడు బాచి.

"పైగా వాటిని ఒకసారి కాల్చేసిన తర్వాత మరి అవి తిరిగి పనికిరావు కద్రా" అన్నాడు గిరిబాబు.

గిరిబాబుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు బాచి, చిన్నవాడు నాని.

కాస్సేపు బాచి, నాని కామయ్యారు.

అదే అదునుగా భావించి, వెంటనే మాట్లాడాడు గిరిబాబు: "అదికాక నిజం మతాబులు కాలుస్తుండగా అందులో ఏదైనా ఒక ఐటమ్ బాగా నచ్చిందనుకో, అలాంటిదే మరొకటి కాల్చాలే తప్ప ముందు కాల్చేసింది తిరిగి కాల్చలేం కదా. పైగా ముందు కాల్చిన దానిలా అలాంటిదే మరొకటి కాల్తుందని గ్యారంటీ ఉండదు కదా"

తలెత్తి సూటిగా తండ్రి మొహంలోకి చూశాడు నాని. గిరిబాబు సన్నగా నవ్వుతున్నాడు.

"నిజం మతాబుల్లో ఎన్నో బాధలు ఉన్నాయి. చేతులూ, ఒళ్ళూ కాలొచ్చు. అలాగే..."

"బట్టలూ కాలిపోవచ్చు" తండ్రికి అడ్డుపడి చెప్పాడు నాని.

గిరిబాబు ఉబ్బిపోతున్నాడు. అన్నాడు: "గుడ్. అవే కాదు ఇళ్లూ కాలిపోవచ్చు"

"కళ్ళూ మండుతాయి. కళ్ళంట నీళ్లు వస్తాయి. ఎర్రబడిపోతాయి" చెప్పుకుపోతున్నాడు నాని.

బాచి అస్తవ్యస్తంగా కదులుతున్నాడు.

గిరిబాబు గారాంగా నానిని అక్కున చేర్చుకొని, "నా నానే. నీకు అన్నీ తెలుసురా. నువ్వు వయస్సుకు థర్డ్ క్లాస్ చదువుతున్నావు కానీ, టెన్తు క్లాస్ చదువుతున్న మీ అన్నయ్య నీ తెలివి ముందు దిగతుడుపేరా" అన్నాడు.

నాని గలగలా నవ్వేశాడు. చెప్పాడు: "డాడీ, మీ కంప్యూటర్ మతాబులే నాకు కావాలి"

"ఎందుకో చెప్పమ్మా మరి" మురిసిపోతూ అడిగాడు గిరిబాబు.

"మీరు చెప్పినట్టు వాటికి పొగ రాదు..."

"డాంకీ ఎగ్గు" విసురుగా అన్నాడు బాచి.

"వాడంతేరా. నువ్వు చెప్పు నాన్న" అన్నాడు గిరిబాబు- నానిని పొందిగ్గా ఒళ్ళో కూర్చుండ పెట్టుకుంటూ.

"మరేమో, చెత్త పోగవ్వదు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి..."

నానికి అడ్డుతగిలి, "నోర్మూయరా... నోర్మూయరా..." అంటూ గోలగోలగా కేకలేయడం మొదలెట్టాడు బాచి.

"నువ్వే నోర్మూయ్... నువ్వే నోర్మూయ్" అంటున్నాడు నాని.

"బాచీ గోలాపి, చెప్పింది వినరా" కలుగచేసుకుంటూ అన్నాడు గిరిబాబు.

అంతలోనే వంటగదిలో నుండి గిరిబాబు భార్య శ్యామల వచ్చింది అక్కడకు- "ఏమిటండీ గోల" అంటూ తడి చేతులను చీర కొంగుకు వత్తుకుంటూ.

తల్లిని చూసి తగ్గారు పిల్లలిద్దరు. అరుపులు ఆపారు.

"నాని నా దారిలోకి వచ్చేశాడే" ఉల్లాసంగా చెప్పాడు గిరిబాబు భార్యతో.

"మీ గొడవలో వీళ్ళ మధ్య గోలను మళ్ళీ క్రియేట్ చేశారా మహాశయా" అంది శ్యామల.

"ముందు నాని ఎందుకు నా వైపు మొగ్గాడో వాడే చెప్తుతాడు వినవే. వీడిలా మీరూ ఆలోచించండి. మారండి" అన్నాడు గిరిబాబు.

"చాల్లెండి. వాడికి ఏ చాక్లెట్లో, ఏ కార్టూన్ కంప్యూటర్ షోలో ఎరవేసి వాడిని మీ వైపుకు తిప్పుకున్నారేమో కానీ, నేను ఎంత మాత్రం మీ గాడిలో పడిపోను... లేను" చెప్పింది శ్యామల.

"నేను కూడా మమ్మీ" అప్పుడే అన్నాడు బాచి.

"నేనేమీ ఎరలు, ఆశలు చూపలేదు. ఏంరా" అన్నాడు ఉడుక్కుంటున్నట్టు గిరిబాబు.

"ఏంకాదు. డాడీ చెప్పిందే కరెక్టు" అన్నాడు నాని.

"ఎంట్రా కరెక్టు" అని నానితో అని, "చూడండీ, దీపావళి వెనుక ఒక అర్థం ఉంది. ఒక శాస్త్రీయ నియమమూ ఉంది. కాదనగలరా" అడిగింది శ్యామల భర్తను.

"తర్కం, సమర్థన వద్దమ్మా. ప్రస్తుత స్థితికి తగ్గట్టుగా మారాలి" అన్నాడు గిరిబాబు.

"ఏంటి మారాలి. గోంగూర" హడావిడిగా అన్నాడు బాచి.

"నువ్వుండ్రా బాచి" అని, "నువ్వు చెప్పవే. దీపావళితో ప్రమోదం పొందాలనుకొని ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం ఏం సబబూ" అన్నాడు గిరిబాబు, భార్యతో.

"అయ్యో... మహానుభావా! సహజత్వంలోని ముచ్చటే ముచ్చట..."

శ్యామలకు అడ్డుతగిలి, "హలో, నువ్వు అంటున్న ముచ్చట, నా హైటెక్ దీపావళిలో ఎంతో విరివిగా, వింతగా లభిస్తోందోయ్. అదో థ్రిల్ అనుకో" అన్నాడు గిరిబాబు.

"ఏమో బాబూ, మీ హైటెక్ గోలతో మాత్రం నాకు తలనొప్పి వస్తోంది రోజున్నూ. ఎమ్మల్ని మభ్యపెడుతున్నట్టుగా ఉంది కానీ..."

"ఆగాగు శ్యామలా, మభ్యపెట్టడం లాంటి మాటలు వద్దు. చూసేవరకు తగ్గు."

"తగ్గుతూనే ఉన్నానండి. మీరు ఆఫీసుకు జీతం కోతతోనూ సెలవులు పెట్టేసి, రోజుకు పదిమార్లకు మించి టీ నీళ్లు పీల్చేస్తూ, రోజంతా ఆ కంప్యూటర్ ముందు పాతేసినట్టు పడివుండడం కానవస్తూన్న నేను తగ్గే ఉన్నాను. హుం చివరికి ఏం సాధించి పెడతారో"

"అంత వెటకారం వద్దమ్మా. నా హైటెక్ దీపావళి కంప్యూటర్ ప్రోగ్రాం పూర్తి కావస్తోంది. దానిని నువ్వు చూస్తే..."

"ఆఁ అది చూడాలనే..."

"కుతూహలం పడుతున్నావు. కదూ"

"అంత లేదు సామీ. కుతూహలమా, పాడా. కడుపులో హాలాహలం ఊరిపోతుంటే."

తమ తల్లిదండ్రుల వాదనల నడుమ ఇరుక్కుపోయి గింజుకుంటున్నారు ఆ పిల్లలిద్దరు.

"నీ సోది ఆపి, కాస్త టీ కలిపి ఇవ్వు. మార్కెట్టుకు వెళ్ళాలి" అన్నాడు గిరిబాబు.

"అవును. అలసిపోతున్నారుగా, రిలీఫ్ ఉండాలి" అంది శ్యామల.

"కాదు లేవోయ్. మంచి ఎఫెక్ట్స్ కొరకు డిజిటల్ సౌండ్ సిస్టమ్ బాక్సులు, బిగ్ సైజ్ ఆడియో కొరకు బిగ్ స్క్రీన్ కొనుగోలు చేయాలి" చెప్పాడు గిరిబాబు.

"అయ్యో, అలాగా. అయ్యా, వాటికి ఎంతేమిటి ఖర్చు" అడిగింది శ్యామల.

"ఆపమ్మా నీ వ్యంగ్యాన్ని. ఎంతైనా అవి పర్మినెంట్. ఒకసారి ఖర్చుతో ఎన్నెన్నో లాభాలు వాటితో ఉంటాయి" చెప్పాడు గిరిబాబు.

"భలే సంబరం. చూడండి, కొండ నాలుకకు మందు..."

"తల్లీ నీ సామెతలు ఆపి, పోయి టీ ఇవ్వవే" అన్నాడు గిరిబాబు విసుగ్గా.

ఆ వెంటనే, "మమ్మీ నువ్వు పోయి టీ తెచ్చి డాడీకి ఇవ్వవే" అన్నాడు బాచి.

"ఏమిట్రా, నువ్వు డాడీ వైపు ఒరుగుతున్నావు" అని అంటున్న శ్యామలను పట్టించుకోకుండా-

"డాడీ, బిగ్ స్క్రీన్ తెస్తారా..." గిరిబాబు దగ్గరకు చేరిపోయి అడుగుతున్నాడు బాచి.

ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచి అక్కడి నుండి కదిలింది శ్యామల వంటగది వైపు.

గిరిబాబు గడగడా నవ్వేశాడు.

"అవును బాచీ, ఆ స్క్రీన్ని వీధి గుమ్మంలో పెడదాం. చుట్టుప్రక్కల వారంతా మన గుమ్మంలోనే మూగిపోతారు- బెల్లం మీద ఈగల్లా."

"అబ్బా, నిఝంగా డాడీ. అంత బాగుంటాయా కంప్యూటర్ మతాబులు" అడిగాడు నాని.

"అవున్రా. మంచిగా కంప్యూటర్ ప్రోగ్రాం వస్తోంది. గమ్మత్తయిన డిజైనింగ్తో, వింతైన ఎఫెక్ట్స్తో చాలా బాగుంటుంది కంప్యూటర్ హైటెక్ దీపావళి. పెద్ద పెద్ద బాంబులు, రాకెట్లు, రకరకాల, రంగురంగుల బెలూన్లు విడిచిపెట్టే తారాజువ్వలు, గాలిలో తిరిగే విష్ణుచక్రాలు, భూమిని విడిచి పైకి లేచి తిరిగే భూచక్రాలు, రంగురంగులతో వింత వింత ఆకారాలను విరజిమ్మే కాకర్లు, విద్దూరమైన ఆకారాలను వెదజల్లే చిచ్చుబుడ్లు... ఇలా ఒకటేమిటిరా ఎన్నో, ఎన్నెన్నో సంభ్రమాశ్చర్యాలను

మీరు నా కంప్యూటర్ హైటెక్ దీపావళిలో చూడొచ్చు. తిరిగి తిరిగి పొందవచ్చు. ఒక్క వాక్యంలో చెప్పాలంటే ఇప్పుడు చూసిన వారంతా ముందు ముందు ఇక దీనినే ఆచరిస్తారు" చెప్పాడు గిరిబాబు ఎంతో ఇదిగా.

పిల్లలిద్దరూ నోళ్లు తెరుచుకొని తండ్రిని చూస్తూ ఉన్నారు.

అప్పుడే శ్యామల వచ్చింది అక్కడకు టీ కప్పుతో.

"పిల్లలిద్దరూ నా వైపేనే. నువ్వూ మారతావు. నువ్వెంత" అన్నాడు గిరిబాబు.

"చూద్దాంలెండి" అంది శ్యామల.

"చూస్తే నువ్వే మారతావు. ఇంకెన్ని రోజులు, మరో రెండ్రోజుల్లోనే దీపావళి వస్తుంది కదా" అన్నాడు గిరిబాబు.

గిరిబాబు అనే ఆ రెండు రోజులు గడిచాయి.

ఆ రోజు దీపావళి– రాత్రి అవుతోంది.

గిరిబాబు అన్నీ సిద్ధం చేసేశాడు. చివరిగా తన ఇంటిముందు బిగ్ స్క్రీన్ అమర్చాడు.

ఈ హంగామా మూలంగా, దానితోపాటు బాచి, నానిల నోళ్ళ చలువతో చాలామంది అప్పటికే ఆ బిగ్ స్క్రీన్ ముందు మూగేశారు. వారంతా తమ తమ ఇళ్ళ ముందు నూనె ప్రమిదలు పెట్టి, వాటిలో దూది వొత్తులు వేసి, వాటిని ముట్టించేసి వచ్చేశారు ఏకావీకిన.

అంతా ఆత్రంగా ఎదురు చూస్తున్నారు– గిరిబాబు హైటెక్ దీపావళి కొరకు.

గిరిబాబు కంప్యూటర్ ముందు కూర్చున్నాడు. నానిని 'ఒన్, టూ, త్రీ' అని అంకెలను నెమ్మదిగా లెక్కించమన్నాడు– కౌంట్‌డౌన్‌లా. నాని అలా అంకెలు లెక్కించడం అవ్వగానే బాచిని పవర్‌కై స్విచ్‌ను ఆన్ చేయమన్నాడు. ఆ వెంటనే బిగ్ స్క్రీన్ మీద తన హైటెక్ దీపావళి మొదలు అవుతోందని, అప్పుడు అంతా చప్పట్లు కొట్టాలని అక్కడ అందరినీ కోరాడు.

అందరిలో కుతూహలం... చిక్కని టెన్షన్...

"శ్యామలా" అంటూ భార్యకై కేకవేశాడు గిరిబాబు– తన చేతి వాచీ వంక చూసుకుంటూ. అంతలోనే, "నానీ టైం కావస్తోంది, అంకెలు చెప్పు" అన్నాడు.

నాని ఆ మూడు అంకెలు స్లోగా అనేశాడు.

"బాచీ, స్విచ్ ఆన్..." అన్నాడు గిరిబాబు.

బాచి ఆ స్విచ్ ఆన్ చేశాడు.

గిరిబాబు ముందు కంప్యూటర్ ఆన్ అయ్యింది. అతడి కుడి అరచేయి కంప్యూటర్ మౌస్‌ను కదులుస్తోంది.

చటుక్కున ఆ బిగ్ స్క్రీన్ మీద ఒక మెసేజ్ ప్రత్యక్షమైంది.

అంతా గొల్లుమన్నారు.

"ఛుఫ్" అంటూ గావుకేక పెట్టాడు గిరిబాబు.

"ఏమైంది డాడీ" అడిగాడు నాని.

"హైటెక్ దీపావళి కంప్యూటర్ ప్రోగ్రామ్ ఫైల్ కరప్ట్ అయ్యిందట" చెప్పాడు బాచి.

అప్పుడే అటు వస్తోన్న శ్యామల కానవచ్చింది గిరిబాబు కన్నీటి చూపులకు. ఆమె చేతిలో ప్రమిద దీపాల పళ్ళెం ఉంది. ఆ దీపాలు నిలకడగా వెలుగుల్ని వెదజల్లుతున్నాయి.

●

# జ్ఞాన జ్యోతిని వెలిగించే
# దీపావళి

భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి మన పండుగలు. వానిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి.

భిన్నత్వంలో ఏకత్వాన్ని సృజించే ఈ దీపావళి కోటి కాంతుల రవళి– విరిసే చైతన్య దీప్తుల జావళి. కొత్త ఆశలతో, ఆశయాలతో ఈ దీపావళి మానవ జీవితంలో పారమార్థిక వెలుగు రేఖలను పూయిస్తుందని హైందవజాతి ప్రగాఢ విశ్వాసం.

**"దీపం జ్యోతి పరబ్రహ్మమ్
దీపం సర్వతమోహరమ్
దీపేన సాధ్యతే సర్వమ్
సంధ్యా దీపం నమోస్తుతే"**

అంటూ మహిళామణులంతా ప్రార్థిస్తూ ఆశ్వయుజ బహుళ చతుర్దశి నుండి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. పైగా ఈ దీపావళి శరదృతువులో అరుదెంచటం విశేషం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది.

పంచభూతాలలో ప్రధానమైనది అగ్ని. ఈ అగ్ని ప్రాణికోటి మనుగడకు ఉపకరించే తేజస్సును, ఆహారాన్ని ఐహికంగానూ, విజ్ఞాన ధర్మగరిమను ఆధ్యాత్మికంగానూ ప్రసాదిస్తుంది. ఈ దీపాల వెలిగింపు ద్వారా మూడు రంగులు ప్రధానంగా మనకు గోచరమవుతాయి. నీలము, పసుపు, తెలుపు– ఈ మూడు రంగులు మానవ మనుగడకు ఆవశ్యకమైన సత్వరజస్తమోగుణాల సమ్మేళనంగా ఆర్యులు చెబుతుంటారు. ఈ మూడు రంగులను జగతిని పాలించే లక్ష్మి, సరస్వతి, దుర్గలుగా భావిస్తారుట పౌరాణికులు. అంతేకాక సత్యం– శివం– సుందరం– అవి దీప ప్రజ్వలన ద్వారా త్రిజగన్మాతలను ఆరాధించినట్లును, మానవులకు విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతమని సందేశాత్మకంగా గైకొంటారు భారతీయులు.

**"అంధతమిస్రంచ దక్షిణాయనమేవచ
ఉత్తరాయణే తస్మా జ్యోతిర్దానం ప్రశస్యతే"**

అంధ తమిస్రమనేది ఒక నరకం. దక్షిణాయన పాపకాలం నుండి (ఆ నరకం నుండి) తప్పించుకొని తరించడానికి ఉత్తరాయణ పుణ్యకాలంలో జ్యోతిని దానం చేయుట ఉత్తమోత్తమమైన కార్యంగా భావిస్తారు హైందవులు.

ఈ దీప విశిష్టతను వివరిస్తూ మహాకవి కాళిదాసు తన రఘువంశ మహా కావ్యంలో 'ఇందుమతీ స్వయంవరం' సన్నివేశంలో వర్ణించారు.

**"సంచారిణీ దీప శిఖేన రాత్రౌ
యంయం వ్యతీయాయ పతింవరా సా
నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రపేదే
వివర్ణ భావం సనభూమిపాలః"**

లోకానుభవం గల కాళిదాసు దీప ప్రస్తావన ఈ శ్లోకంతో ఉపమాలంకారంలో వివరించాడు. పరంపరాగతమైన అభియుక్తోక్తి యిది. అంతేకాక విశాఖ దత్త కవికృతమైన 'ముద్రారాక్షస' నాటకంలో మూడవ అంకమందు ఈ దీప ప్రస్తావన ఉంది.

**"క్షణమనభిముఖీ– రత్నదీప ప్రభాణామ్"**

అని దీప ప్రాముఖ్యతను వివరించాడు. దీనికి మల్లినాథుడు కూడా చక్కని ఉదాహరణలిచ్చాడు.

**"దృష్టిరాశే కరాకించితో స్ఫుటాపాంగే ప్రసారితా,
మీలితార్థ పుటాలోకే తారావ్యావర్త నోత్తరా"**

అని వివరణ ఇచ్చాడు.

అనగా కొత్తగా అప్పుడే నిద్ర నుండి తెలచుటచే అరతెరపుగానూ, మసకగానూ ఉన్నదియు, తటాలున పళపళన రత్నదీపాల కాంతి కన్పించగానే ఒక్క నిముషము దానిని ఎదురుకోలేక కుంచితమైనది. కాంతి వెలుగులను గూర్చి గీతాచార్యుడు తన గీతలో ఇలా ప్రస్తావన చేశాడు.

**"యదాదిత్య గతం తేజో
జగద్భాసయతే ఖిలమ్
యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ
తత్తేజో విద్ధిమామకమ్"**

సూర్యుని యందలి ఏ ప్రకాశము లోకమునంతను వెలిగించుచున్నదో చంద్రాగ్నులయందు ఏ ప్రకాశము కలదో ఆ ప్రకాశమే పరమాత్మ స్వరూపమని తెల్పుతూ వెలుగు సందేశాన్నిచ్చాడు. అంతేకాక–

**"జ్ఞాన జ్యోతి వైరాగ్య తైల
సంపూర్ణే భక్తివర్తి సమ
న్వితే ప్రబోధ పూర్ణ పాత్రే
తు జ్ఞప్తి దీపం విలోకయేత్"**

ప్రబోధమను పాత్రలో వైరాగ్యమనే తైలాన్ని పోసి, భక్తి అనే వత్తిని వెలిగించి 'జ్ఞాన జ్యోతి' ప్రకాశించు విధంగా జ్ఞానులు (మహర్షులు) తెలిపారు. మరియు–

**"తమసోమా జ్యోతిర్గమయా
మృత్యోర్మా అమృతంగమయా"**

అజ్ఞానమనెడి చీకటి నుండి జ్ఞానమనెడి వెలుగులోకి వెళ్లుట. అనగా తమస్సు నుండి పటాపంచలైపోయి విజ్ఞానజ్యోతులు వెలుగులోకి నడుస్తాయన్నమాట. కనుక మానవులంతా మూర్ఖత్వం నుండి చైతన్యంలోకి, చీకటి నుండి వెలుగులోకి నడుస్తారని ఆశిద్దాం. ఈ దీపావళి ప్రాణికోటికి నవఉషస్సుల మహస్సులను కలిగిస్తుందనుట అతిశయోక్తి కానేరదు.

– ఆచార్య శ్రీవత్స